క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని తూర్పు బజారు పోలేరమ్మ ఆలయ 102వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని పూల మాలలతో అలంకరించారు. ఆలయం ఎదురుగా ఉన్న మహాలక్ష్మి చెట్టు వద్ద భక్తులు పసుపు నీటితో వార్లు పోసి పూజలు చేశారు. పోలేరమ్మకు అర్చకులు నారాయణం వంశీకృష్ణ పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పుష్పాలతో అలంకరించి అష్టోత్తర, సహస్ర నామాలతో విశేష పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు.

ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శం



ఫిరంగిపురం: ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని యూనివర్సల్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్(మేడికొండూరు) ఫాదర్ పి.బాలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్ హెచ్ఎం పి.శౌరయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం మంగళవారం పాఠశాలలోని ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాల ఏసుదేవాలయ విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి, యూనివర్సల్ కళాశాల కరస్పాండెంట్ పి.బాలస్వామిలు పాల్గొని శౌరయ్యను సన్మానించారు. పాఠశాలకు శౌరయ్య చేసిన సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధన భాజపాతోనే సాధ్యం

తాడికొండ: అంబేడ్కర్ ఆశయ సాధన బీజేపీతోనే సాధ్యమని తాడికొండ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం తాడికొండలో ఎస్సీ, ఎస్టీ ప్రజా ప్రతినిధులు, దళిత నాయకులను కలిసి సన్మానించే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా పొన్నెకల్లు సర్పంచ్ నూకతోటి మేరిమ్మ, ఎంఆర్పీఎస్ నాయకులు పల్లెపోగు రాజారావు, ఆంధ్రాటుడే ఎడిటర్ బెజ్జం సాయి ప్రసాద్, డేవిడ్‌లను సత్కరించారు. భాజపా మైనార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ బిలాల్, ఆరుద్ర గోపీ, మార్నెళ్ల ప్రకాష్ రావు, ఉండవల్లి నాగేశ్వరరావు, దుంపుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ చికిత్సా కేంద్రాలు తనిఖీ



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాలలో హెచ్ఐవీ బాధితులకు చికిత్స అందిస్తున్న కేంద్రాలను మంగళవారం ఏపీ శాక్స్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ నీలకంఠారెడ్డి తనిఖీ చేశారు. గుంటూరు జీజీహెచ్‌లో హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు చేసే ఐసీటీసీ కేంద్రంలో ఏ కిట్‌లతో హెచ్ఐవీ పరీక్షలు చేస్తున్నారు.. బాధితులకు ఏవిధంగా కౌన్సెలింగ్ చేస్తున్నారు.. రికార్డులు ఏవిధంగా నిర్వహిస్తున్నారనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గర్భిణుల విభాగంలో ఏవిధంగా టెస్టులు చేస్తున్నారు.. బాలింతల నుంచి పుట్టబోయే బిడ్డలకు హెచ్ఐవీ సోకకుండా ఏవిధమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారనే విషయాలను పరిశీలించారు. హెచ్ఐవీ బాధితులు ఏఆర్టీ కేంద్రంలో ఏవిధంగా చికిత్స పొందుతున్నారు.. అక్కడ ఉన్న వైద్య సౌకర్యాలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం గుంటూరు వైద్య కళాశాలలో వైరల్‌లోడ్ మిషన్‌ను ఎస్ఆర్ఎల్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఏపీశాక్స్ ఐసీటీసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్, శ్యామ్‌సన్, జ్యోతుల వీరాస్వామి, సుకుమార్ పాల్గొన్నారు.

డివిజన్‌లలో మెరుగైన పారిశుద్ధ్యానికి చర్యలు

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, డివిజన్ వారీగా మెరుగైన పారిశుద్ధ్య పనులు జరిగేలా ప్రజారోగ్య అధికారులు బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గోరంట్ల, అరండల్‌పేట, అమరావతి రోడ్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య విభాగానికి అదనపు కార్మికులను, వాహనాలను, చెత్త సేకరణకు పుష్‌కాట్స్ ఇచ్చినప్పటికీ ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శుల పర్యవేక్షణ లోపం వలన ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్యం అందడం లేదన్నారు. కార్మికులు తమకు కేటాయించిన ఇళ్లల్లో నూరు శాతం చెత్త సేకరణ చేయాలని, మధ్యాహ్నం సమయంలో అంతర్గత డ్రెయిన్లను శుభ్రం చేయాలని స్పష్టం చేశారు. ఇక నుంచి మధ్యాహ్నం సమయంలో కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఎస్‌లు క్షుణ్ణంగా పర్యవేక్షణ చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆటో డ్రైవర్లకు బాబు మొండిచెయ్యి

- ఎన్నికల హామీని విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ఏడాదికి రూ.15 వేలు ఎగవేత
- గతంలో ఆటో డ్రైవర్లకు అండగా జగన్ సర్కార్



మంగళగిరి: నియోజకవర్గంలోని 3 మండలాల్లో సుమారు 450 వరకు ఆటోలున్నాయి. మంగళగిరి నుంచి విజయవాడ, గుంటూరు, తెనాలి, నూతక్కి, దుగ్గిరాల, అమరావతి, తుళ్లూరు, తాడికొండ, ఎస్ఆర్ఎం, అమృత యూనివర్శిటీ, వీవీఐటీ యూనివర్శిటీలకు ప్రయాణికులను చేరవేస్తున్నాయి. ఆర్టీసీ బస్సులు సరైన సమయాల్లో లేకపోవడం, ప్రయాణికులు వెళ్లే సమయంలో బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు అధికంగా ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరచూ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతుండడం, ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర రూ.100కు పైగా, పెట్రోలు ధర రూ.112 వరకు ఉంది. దీంతో ఆటో డ్రైవర్లు రోజంతా కష్టపడినా రూ.300 నుంచి రూ.400 ఆదాయం రావడం గగనంగా మారింది. సొంత ఆటోలు అయితే కొంత ఆదాయం ఉండగా అద్దె ఆటోలు అయితే డీజిల్, అద్దె ఖర్చులకే వచ్చే ఆదాయం సరిపోతుందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ల కోసం దాదాపు రూ.15 వేలు ఖర్చు అవుతుంది. వీటితో పాటు తనిఖీలు పేరుతో పోలీసులు, రవాణా శాఖ అధికారులు దాడులు నిర్వహించి రూ.వేలల్లో జరిమానాలు విధించడం, ఆటో కొనుగోలు కోసం తీసుకున్న రుణాలకు నెలవారీ కట్టుకోలేక ఆటో కార్మికులు బతుకులు దినదిన గండంగా మారాయి. వచ్చే అరకొర డబ్బులు ఇంధనం, ఇతర ఖర్చులకే సరిపోతున్నాయని వాపోతున్నారు.

గత ప్రభుత్వం చేయూత..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే ఆటో కార్మికుల కష్టాలను గుర్తించి వారి సంక్షేమం కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అర్హులైన ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీక్యాబ్ డ్రైవర్లకు రూ.10 వేలు చొప్పున ఏటా వారి ఖాతాల్లో జమ చేసేవారు. దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల భీమా వర్తింపచేశారు. అలాగే వాహనాల కొనుగోలుకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే డ్రైవర్లకు రూ.3 లక్షల వరకు వడ్డీ రాయితీ అందించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం డ్రైవర్లను ఆదుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తుంది. ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలో వచ్చి 10 నెలలు గడుస్తున్నా హామీని అమలు చేయడంలేదని ఆటో కార్మికులు మండి పడుతున్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి..



ఇప్పటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆటో డ్రైవర్ల కష్టాలు గుర్తించిన ఏకైక నాయకుడు జగన్మోహన్‌రెడ్డి మాత్రమే. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారు. ఏటా రూ.10 వేలు ఇచ్చి డ్రైవర్లను ఆదుకున్నారు. ఎన్నికల్లో డ్రైవర్లకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదు. వెంటనే ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇచ్చి ఆదుకోవాలి.

– రాంబాబు, ఆటో డ్రైవర్

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం..



రోజంతా కష్టపడి ఆటో నడిపినా కుటుంబ పోషణ కష్టంగానే ఉంది. నిత్యావసర సరుకులతో పాటు ఇంధన ధరలు భారీగా పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అప్పు చేసి ఆటో కొనుగోలు చేశాం. వాటికి ఫైనాన్స్, భీమా ప్రీమియం, రోడ్ ట్యాక్స్ కట్టుకోలేక ఆటోలను నడపలేకపోతున్నాము. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు రూ.15 వెంటనే అందజేసి ఆదుకోవాలి.

– శ్రీను, ఆటో డ్రైవర్

క్యాంపస్ సెలక్షన్‌లో విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

మేడికొండూరు: మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కియా మోటార్స్ క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్‌కి 51 మంది విద్యార్థులు సెలెక్ట్ అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ప్రముఖ కార్ల తయారీ కంపెనీ అయినా కియా మనదేశంలో ఎంతో ప్రాచుర్యం సంపాదించిందని ఇలాంటి మల్టీనేషనల్ కంపెనీలో తమ విద్యార్థులు క్యాంపస్ ప్లేస్మెంట్ ద్వారా సత్తా చూపడం హర్షణీయమని అన్నారు. ఎన్ఆర్ఐ సంస్థల పీడీ తిలక్‌బాబు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కళాశాల పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ.. తమ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కళాశాల మేనేజ్మెంట్ ఎంతగానో సహకరిస్తుందని తెలియజేశారు. పాలిటెక్నిక్ ఆధిపతులు శ్రావణి, వాసు, పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ పి.మనోహర్, కళాశాల ఏవో సీతారామయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహర్‌రావు ఎంపికైన వారిని అభినందించారు. ఈ రిక్రూట్మెంట్ డ్రైవ్‌లో కియా నుంచి ఏపీ ఐ.టి.ఎ డైరెక్టర్ ఎం.సత్యరత్నం, ఆదిబట్ల ఉమాశంకర్ కియా మోటార్స్ మానవ వనరుల సీనియర్ ఎగ్జిక్యూటీవ్ మనీష్ ఓజార్కర్, కియా మోటార్స్ హెచ్.ఆర్, మేనేజర్, రిక్రూట్మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళాకాశం మొబైల్ యాప్‌పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్పీలు

మంగళగిరి టౌన్: మహిళా సంఘాలు త్వరితగతిన మెరుగైన సేవలు తెలుసుకోవడానికి ప్రభుత్వం మహిళాకాశం అనే మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నదని మంగళగిరి మెప్మా సి.ఎం.ఎం మాలతి అన్నారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆర్పీలకు మహిళాకాశం మొబైల్ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈ యాప్ టెస్టింగ్‌లో ఉందని.. ఆర్పీలు వారి అభిప్రాయాలను అందులో పొందుపరచి ఏమైనా యాప్‌లో సమస్యలు ఉన్నట్లు గుర్తించి తెలియజేస్తే యాప్‌ను మరింత అభివృద్ధి చేసి రానున్న నాలుగైదు రోజుల్లో అందుబాటులోకి తేనున్నట్లు పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా మహిళా సంఘాల సమావేశాలు, తీసుకున్న నిర్ణయాలు, నిర్వహించిన కార్యక్రమాలు నమోదు చేయవచ్చని తెలిపారు. క్షేత్ర స్థాయిలో మహిళా సంఘాల పర్యవేక్షణ సులభతరం అయ్యేందుకు ఈ యాప్ ఎంతగానో దోహదపడుతుందని, దానిపై ఆర్పీలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఓలు జ్యోతి, సుధాకర్, మంగళగిరి పట్టణ, రూరల్ మండలాల ఆర్పీలు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ భూముల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



కార్మికులకు మద్దతుగా సీఐటీయూ నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురం ఎ.సి.సి సిమెంట్ ఫ్యాక్టరీ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కార్మికులకు నష్ట పరిహారం చెల్లించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేములు దుర్గారావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తన అధికారాన్ని ఉపయోగించి ఎ.సి.సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వం యాజమాన్యం పట్ల సానుకూల వైఖరి తగదని అన్నారు. ఎన్నికల సమయంలో నారా లోకేష్ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇప్పుడు మంత్రి అయ్యారు కాబట్టి కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.లక్ష్మి, రమణ, శారద, ఇమాంబి, సారమ్మ, దుర్గాభవాని, ఎం.గురవయ్య, హగ్గయ్య, నాగేశ్వరరావు, సుబ్బారావు, ఆదినారాయణ, భాషా తదితరులు పాల్గొన్నారు.

హోమ్ కంపోస్ట్ తయారీపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ శకుంతల

మంగళగిరి టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని.. అందులో భాగంగా నిత్యం ఇంట్లో ఉత్పత్తి అవుతున్న తడి, పొడి చెత్తలను వేరుచేసి హోమ్ కంపోస్ట్‌ను తయారు చేయడం అలవర్చుకోవాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ శకుంతల అన్నారు. ఎంటీఎంసీ కార్యాలయంలో మంగళవారం మంగళగిరి పట్టణ, మండల పరిధిలోని రీసోర్స్‌పర్సన్ (ఆర్పీలు)లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంట్లోని వ్యర్థాలను సేకరించి తడి చెత్తతో కంపోస్ట్ ఎరువులను తయారు చేసుకోవచ్చని అన్నారు. ఇంట్లో వెలువడే చెత్తను తడిచెత్త, పొడిచెత్తలను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. వంటగదిలోని వ్యర్థాలతో ఎరువును తయారుచేసి ఇంట్లో మొక్కలకు ఉపయోగించవచ్చని సూచించారు. కార్యక్రమంలో మెప్మా సి.ఎం.ఎం మాలతి, సీఓలు జ్యోతి, సుధాకర్, ఆర్పీలు పాల్గొన్నారు.

మండల అధికారులతో సమీక్షా సమావేశం



ముందు వరుసలో కూర్చున్న రెండు మండలాల టీడీపీ నాయకులు

తాడికొండ: గ్రామ పంచాయతీల పరిధిలో వేస్తున్న ప్రైవేటు వెంచర్ల వివరాలు తీసుకుని పంచాయతీకి రావాల్సిన 10 శాతం భూమి రిజిస్ట్రేషన్ చేసుకొని స్వాధీనం చేసుకోవాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన తాడికొండ, తుళ్లూరు మండలాల అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అనుమతులు లేని వెంచర్లు, అనుమతులు ఉన్న వెంచర్లపై ఆయన వివరాలు ఆరా తీశారు. అధికారిక లే అవుట్లు ఉంటే 10 శాతం భూమి స్వాధీనం చేసుకొని హద్దులు వేయాలని సూచించారు. ఈవోఆర్డీ పనితీరుపై ఫిర్యాదులున్నాయని.. అందరితో సమన్వయంగా నడుచుకుంటూ పనితీరు మార్చుకోపోతే సహించేది లేదని హెచ్చరించారు. అధికారులు సమయానికి సమీక్షకు హాజరు కాకుండా ఆలస్యంగా రావడంపై ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో ముందు వరుసలో టీడీపీ నాయకులు బారులు తీరి కూర్చొని ఉండడం గమనార్హం. కాగా వారు సలహాలు, సూచనలు ఇవ్వడం అధికారులు వారికి సమాధానాలు చెప్పడం చూసి పలువురు నోటిన వేలేసుకున్నారు. కార్యక్రమంలో తాడికొండ ఎంపీడీవో కె.సమతావాణి, తాడికొండ, తుళ్లూరు తహసీల్దార్‌లు మెహర్ కుమార్, సుజాత పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణలో వైఫల్యం

- ఈ నెల 6వ తేదీన కుక్క దాడిలో బాలుడి మృత్యువాత
- తాజాగా పిచ్చికుక్క దాడిలో 20 మందికి గాయాలు



గతంలో నీటితొట్టెల ఏర్పాటుకు విడుదల చేసిన జీవో

నెహ్రూనగర్: నగరంలో కుక్కల నియంత్రణకు నగరపాలక సంస్థ వైఫల్యం కనిపిస్తోంది. ఈ నెల 6వ తేదీన కుక్క దాడిలో స్వర్ణభారతీ నగర్‌కు చెందిన బాలుడు మృతి చెందిన ఘటన మరువకుండానే తాజాగా సోమవారం ఏటీ అగ్రహారం పిచ్చి కుక్క సుమారు 20 మందిని గాయపరిచింది. దీంతో వారంతా జీజీహెచ్‌కు వెళ్లి చికిత్స చేయించుకుని వెళ్లిపోయారు.

వేసవిలో నీరు, ఆహారం లేక దాడి

వేసవిలో వీధి కుక్కలకు సరైన నీరు లేక, ఆహారం లేక దారిన పోయే వారిపై దాడులు చేస్తుంటాయి. వీటి నియంత్రణకు నగరపాలక సంస్థ పటిష్ఠ చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఆ దిశగా అడుగులు వేయడం లేదు. 2017లో వీధి కుక్కల దాహార్తిని తీర్చేందుకు నగరపాలక సంస్థ నీటి తొట్టెలను నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన విషయాన్ని జంతు ప్రేమికులు చెబుతున్నారు. కాని ప్రస్తుతం వాటిని నీటి తొట్టెలు ఏర్పాటు చేయడంలో అధికారులు వైఫల్యం చెందినట్లు వారు ఆరోపిస్తున్నారు.

ఏబీసీ ఆపరేషన్లు చేస్తారంట!

ఈ నెల 6వ తేదీన కుక్క దాడిలో మరణించిన బాలుడి ఉదాంతంతో సీఎం చంద్రబాబు యుద్ధ ప్రతిపాదికన ఏబీసీ ఆపరేషన్లు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో ఏదో ఒక చోట వీధి కుక్కల దాడిలో నగర వాసులు గాయాలపాలవుతున్నా నగరపాలక సంస్థ అధికారులు ఇంత వరకు ఆపరేషన్లు ప్రారంభించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీనిపై నగరపాలక సంస్థ వెంటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎం వెంకటేశ్వర్లు వివరణ కోరగా బుధవారం నుంచి వీధి కుక్కలకు ఆపరేషన్లు ప్రారంభిస్తామని చెప్పారు.

ఏబీసీ కేంద్ర నిర్మాణం పట్ల నిరసన



పెదకాకాని: కుక్కల కుటుంబ నియంత్రణ కేంద్ర నిర్మాణంపై మంగళవారం గ్రామ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని పెదకాకాని తక్కెళ్లపాడు గ్రామాల మధ్య గుంటూరు కార్పొరేషన్ అధికారులు యానిమల్ బర్త్ కంట్రోల్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ భవన నిర్మాణంలో భాగంగా ఆ ప్రదేశంలోని పెద్ద చెట్లను తొలగించారు. ఏటుకూరు రోడ్డులోని ఏబీసీ కేంద్రాన్ని తక్కెళ్లపాడు శివారుకు మార్చడంతో చుట్టు పక్కల గ్రామాలకు కుక్కల వల్ల దుర్వాసన, వాటి బెడద ఎక్కువ కావడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయని నిరసన తెలిపారు. దీనిపై గత సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు కూడా చేశారు. చెట్లు నరకడంపై పెదకాకాని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ అక్కడికి చేరుకుని పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి, మునగపాడు, పొనుగుపాడు, గుండాలపాడు, బేతపూడి, కండ్రిక, యర్రగుంట్లపాడు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా ఆ గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని అన్నారు.

మాజీ మండలాధ్యక్షుడి తల్లి అనారోగ్యంతో మృతి



తాడికొండ: తుళ్లూరు మండలం మాజీ మండలాధ్యక్షులు, సీనియర్ నాయకులు బత్తుల కిషోర్ మాతృమూర్తి బత్తుల లక్ష్మమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

ప్రత్తిపాడు: పెదనందిపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యాధికారులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. ఎన్‌సీడీ సీడీ 3.0 సర్వే వివరాలతో పాటు పీఎంజేఏవై, ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్, వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేల్లో అలసత్వం లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు.

అంగన్‌వాడీలో పౌష్టికాహార వారోత్సవాలు

ఫిరంగిపురం: తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్ఠమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్. వెంకటేశ్వరమ్మ అన్నారు. మండల కేంద్రంలో సచివాలయం–3 పరిధిలోని 1,7వార్డుల్లో మంగళవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ.. ప్రసవించిన వెంటనే చిన్నారులకు తల్లిపాలు పట్టాలని సూచించారు. అంగన్‌వాడీలు, మహిళా పోలీసులు, తల్లులు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణపై అవగాహన



కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు, ఏవో వాసంతి

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు భూమి ఆరోగ్యం, భూమి సామర్థ్యం, మట్టి నమూనా సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు టి.శ్రీనివాసరావు మాట్లాడారు. సారవంతంగా ఉండటం ద్వారా భూమి ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. పలు అంశాలను గురించి వారికి వివరించారు. అనంతరం మట్టి నమూనాలు సేకరించడం, వాటిని ఏ విధంగా ప్యాక్ చేయాలో తెలియజేశారు. గ్రామంలో ఎంపిక చేసిన సర్వే నెంబర్లలో మట్టి నమూనా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏవో వాసంతి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి షేక్.సుభానీ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య

ఫిరంగిపురం: విశ్వకథోళిక శ్రీసభాధినేత పోప్ ఫ్రాన్సిస్ మృతి యావత్ ప్రపంచానికి తీరని లోటని గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మండల కేంద్రంలోని బాలఏసు దేవాలయంలో మంగళవారం పోప్ ఫ్రాన్సిస్ మృతి సందర్భంగా అశ్రునివాళి, దివ్యబలిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలు ప్రాంతాల విచారణ గురువులు పాల్గొన్నారు. భాగ్యయ్య వాక్యోపదేశం చేస్తూ.. భగవంతుడు క్రీస్తు శాంతిని పోప్ ఫ్రాన్సిస్‌కు కలుగచేస్తాడని అన్నారు. ఆయన అనుకువతో ప్రజలకు ఎన్నో సేవలు అందించారని చెప్పారు. ప్రపంచంలో ఎంతో పేరును సంపాదించుకున్నట్లు తెలిపారు. అనంతరం దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించారు. ప్రార్థనాగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో బాలఏసు దేవాలయ విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి, విచారణ గురువులు, కథోళిక క్రైస్తవులు పాల్గొన్నారు.

తెగిపోయిన చేతిని అతికించారు..

గుంటూరు మెడికల్: మోచేతి వరకు పూర్తిగా కట్ అయి విడిపోయిన యువకుడి చేతిని విజయవంతంగా ఆపరేషన్ చేసి అతికించినట్లు గుంటూరు ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకులు, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పి.కృష్ణ శ్రవంత్ తెలిపారు. మంగళవారం గుంటూరువారితోటలోని ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బిహార్‌కు చెందిన వ్యక్తి చేయి పూర్తిగా కట్ అయి గోనె సంచిలో చేతిని వేసుకుని 2024 డిసెంబరులో ఆస్పత్రికి వచ్చారన్నారు. పేషెంట్ వచ్చిన 15 నిమిషాల్లోనే చికిత్స మొదలు పెట్టి, డిసెంబర్ 12న, 2025 మార్చి 4 న అరుదైన శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేశామన్నారు. ఆపరేషన్‌కు దాదాపు 7 నుంచి 8 గంటల సమయం పట్టిందని, ఎనిమిది యూనిట్లు రక్తం ఎక్కించి ఆపరేషన్ చేశామన్నారు. ప్రస్తుతం అతను చేతి వేళ్లు కదిలిస్తున్నట్లు వెల్లడించారు. ప్రముఖ హ్యాండ్ సర్జన్ డాక్టర్ బిందేష్ మాట్లాడుతూ చేతులు, కాళ్లు కట్ అయితే ఆ భాగాలను సెలైన్ బాటిల్‌లో గానీ నీటిలో గానీ పెట్టి ఐస్ ప్యాక్‌లో ఆసుపత్రికి తీసుకు రావాలన్నారు. వేలు కట్ అయితే నాలుగు గంటల్లోపల ఐస్ ప్యాక్‌లో తేవాలన్నారు.

వైద్య కళాశాలలో డైనింగ్ రూమ్ ప్రారంభం



డైనింగ్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో 1997 బ్యాచ్ వైద్య విద్యార్థులు విరాళంతో అందించిన డైనింగ్ టేబుల్ రూమ్‌ను మంగళవారం గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, పూర్వ వైద్య విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. కళాశాల అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థులు చేస్తున్న సాయాన్ని అభినందించారు. అనంతరం హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన అంతర్ కళాశాలల క్రికెట్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన వైద్య కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com